
సాక్షి ఒడిశా

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.4.61.258
బంగారం: 8 గ్రాముల 980 మిల్లీ గ్రాములు
వెండి: 155 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



విషాదం..!

బాలాసోర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.

- 8లో



ముగిసిన అంతర్జాతీయ సదస్సు

వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సెంచూరియన్ వర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది.

- 8లో

న్యూస్‌రీల్

7 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం



మంత్రి మండలి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన శనివారం మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 7 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదించినట్లు రాష్ట్ర న్యాయ, అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మీడియాకు సంక్షిప్తంగా తెలియజేశారు. ఆమోదం పొందిన మంత్రి మండలి తీర్మానాల్లో కామధేను పథకం ప్రధానమైనదిగా పేర్కొన్నారు. ఈ పథకం కింద పాడి పశువుల పెంపకం, పాడి ఉత్పాదనల ప్రోత్సాహం కోసం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దీనిలో భాగంగా పశువుల బీమా వ్యయ భారంలో 85 శాతం ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన 15 శాతం మాత్రమే పాడి రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సోషల్ మీడియా బంద్



భద్రక్ వీధుల్లో పోలీసు గస్తీ

భువనేశ్వర్: భద్రక్ పట్టణంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. సమస్యాత్మక సోషల్ మీడియా సందేశం ప్రసారంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇరువర్గాల మధ్య వివాదం తారా స్థాయికి చేరింది. పరిస్థితిని అదుపులోకి తీసుకుని శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు యంత్రాంగం కట్టుదిట్టంగా వ్యవహరిస్తోంది. వివాదస్పద ప్రాంతంలో ఇంటర్నెట్ వ్యవస్థని స్తంభింపజేసి వాట్సాప్, ఫేస్‌బుక్, ట్వీటర్ వంటి సాంఘిక మాధ్యమ ప్రసారాలను కట్టడి చేశారు. మరో వైపు పట్టణ వ్యాప్తంగా పోలీసు బందోబస్తు పటిష్టపరిచారు. పలుచోట్ల సమగ్రంగా 10 ప్లాటూన్ల పోలీసులను మోహరించారు. పోలీసులపై దాడికి పాల్పడిన నేరం కింద 10 మంది సందిగ్ధ వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

మత్స్య రైతులకు శిక్షణ శిబిరం



శిక్షణలో పాల్గొన్న రైతులతో అధికారులు

జయపురం: స్థానిక ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు మత్స్య వ్యవసాయంపై శిక్షణ శిబిరం శనివారం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ విభాగం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి, నవరంగపూర్ జిల్లా కొశాగుమడ సమితిలకు చెందిన 161 మంది రైతులు పాల్గొన్నారు చేప పిల్లలను చెరువులో విడిచినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వాళ్లకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పారిడ, ప్రభుత్వ మత్స్య విభాగ అధికారి సింహాచల పాఢి, జిల్లా మత్స్య కార్యాలయ అధికారి త్రివేణి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ క్యాంపును జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి నుంచి కార్డియాలజీ డాక్టర్ ఎల్.విజయకుమార్, న్యూరాలజీ డా.వి.ప్రియా, పల్మోనోలజీ డాక్టర్ వెంకట మోహన్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ డాక్టర్ కిరణ్ విచ్చేసి కోర్టు ఉద్యోగులకు, బార్ అసోసియేషన్ సభ్యులకు పలు పరీక్షలు చేశారు. హృద్రోగులకు 2డీ ఇకో, ఈసీజీ వంటి పరీక్షలును దాదాపు 240 మందికి చేసినట్లు జెమ్స్ ఆస్పత్రి డీజీఎం ఎస్.విజయ భాస్కర్ తెలియజేశారు. ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌కు కోర్టు సిబ్బంది, జెమ్స్ అసిస్టెంట్ మేనేజర్ నారాయణరావు తదితరులు సహకరించారు.

భద్రక్ ఘటన నిందితుడు అరెస్టు

భువనేశ్వర్: భద్రక్ ప్రాంతంలో సోషల్ మీడియా (ఫేస్‌బుక్) ప్రసారంతో తీవ్ర సంచలనం రేపిన సంఘటనలో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు భద్రక్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శనివారం ప్రకటించారు. ఈ సంఘటనలో పోలీసులపై రాళ్లు రువ్వి దాడికి పాల్పడిన నేరం కింద మరో 9 మందిని అరెస్టు చేసినట్లు ప్రకటించారు.



సునాబేడాలో మజ్జిగౌరి అమ్మ వారు(ఫైల్)

అమ్మలగన్న అమ్మ... ముగ్గురమ్మల మూలపుటమ్మ కొలువుదీరే సమయం ఆసన్నమైంది. భక్త జనులందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగించే జగన్మాత తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనుంది. అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు లోకమాత భక్తుల చెంతకే వచ్చి పూజలు అందుకోనుంది. దీంతో అమ్మవారి ఆగమనం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో బంగరు దుర్గను భక్తితో కొలిచే విశిష్టత తెలియజేయడమే ఈ వారం సండే స్పెషల్....

– సాక్షి నెట్‌వర్క్

- రాష్ట్రంలో శరన్నవరాత్రులకు సన్నాహాలు
- విభిన్న పద్ధతుల్లో పూజలందుకోనున్న జగన్మాత

SUNDAY SPECIAL

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..!



శ్రీక్షేత్రంతో ముడి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఆధ్యాత్మిక, ధార్మికపరమైన సంస్కృతి, సంప్రదాయాలు శ్రీజగన్నాథుడు కొలువుదీరిన శ్రీక్షేత్రం (పూరీ) నుంచి ఆవిర్భవించినట్లు పలు కథనాలు స్పష్టం చేస్తున్నాయి. వైష్ణవ, శాక్తేయ సంప్రదాయాల మేళవింపుతో దుర్గామాధవులు ఈ క్షేత్రంలో పూజలు అందుకోవడం విభిన్నం. మట్టి బొమ్మలతో దేవీ పూజల సంప్రదాయం ఈ క్షేత్రం నుంచి 11వ శతాబ్దంలో ఆరంభమైంది. గంగ వంశం రాజు చోడ గంగ దేవ్ హయాంలో మట్టి బొమ్మల పూజోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు చారిత్రాత్మక కథనం. క్రమంగా ఈ సంస్కృతి రాష్ట్రమంతటా వ్యాపించింది. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నిత్యం సరికొత్త పుంతలతో దసరా ఉత్సవాలకు కొత్త కళని తీర్చిదిద్దుతున్నారు.

స్వర్ణ కాంతులతో...

మట్టితో తయారు చేసిన నిలువెత్తు దేవీ ప్రతిమలకు అమూలమైన బంగారం, వెండి ఆభరణాలతో కనులు మిరమిట్లు గొలిపేట్లు అలంకరించడంలో కటక్ మహా నగరం ప్రసిద్ధి. ఈ ఏడాది నగరవ్యాప్తంగా పలు చోట్ల సమగ్రంగా 170 పూజా మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏటా 34 మండపాల్లో దేవీ ప్రభ, మకుటం ఇతరేతర ఆభరణాల అలంకరణ వెండితో నిర్వహించడం ఆచారంగా మారింది. ఈ ఏడాది కొత్తగా మరో రెండు ప్రాంతాల్లో ఈ శోభతో దుర్గా మాత జిగేలుమంటుంది. కటక్ నగరం రామగడ్ మరియు తులసీపూర్ ప్రాంతాల్లో కొత్తగా వెండి అలంకరణకు నడుం బిగించడం విశేషం. నగరంలో 15 చోట్ల దుర్గాదేవి ప్రతిమలను బంగారంతో అలంకరించనున్నారు. ఈ ఏడాది సమగ్రంగా కటక్ నగరంలో దేవీ పూజల్లో రూ.100 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించేందుకు అనుబంధ వర్గాలు సిద్ధం అయ్యాయి.

శారదీయ రథయాత్ర

శ్రీజగన్నాథ సంస్కృతిలో ప్రతి కోణం విభిన్నతతో ఇమిడి ఉంటుంది. దసరా పురస్కరించుకుని శ్రీమందిరం ప్రధాన సముదాయంలో నెలకొని ఉన్న విమాల దేవి, శ్రీజగన్నాథుడిని ప్రత్యేకంగా పూజిస్తారు. విమలా మాత మహిషాసుర మర్దిని (దుర్గా), శ్రీ జగన్నాథుడు మాధవునిగా ఉమ్మడిగా పూజలు అందుకోవడంతో దుర్గామాధవ ఉత్సవంగా వాసికెక్కింది. ఈ ఉత్సవంతో శ్రీజగన్నాథుడిని దుర్గామాధవునిగా పూజించడం ఆచారంగా మారింది. ఈ సందర్భంగా అశ్విని కృష్ణ మూల అష్టమి తిథి నుంచి అశ్విని శుక్ల నవమి వరకు నిరవధికంగా 16 రోజులపాటు జరిగే పూజలను శాక్త గుండిచా లేదా శారదీయ రథయాత్రగా పేరొందింది. ఈ వ్యవధిలో పలు గోప్య సేవలు చేపట్టి విభిన్నంగా చేపడతారు. ఈ ఉత్సవాన్ని గోప్య గుండిచా (రహస్య యాత్ర)గా పేర్కొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ శక్తి పీఠాల్లో షోడశ దినాత్మక పూజలు నిర్వహిస్తారు. ఆయా పీఠాలకు పూరీ శ్రీజగన్నాథుని సన్నిధి నుంచి ప్రత్యేక పూజా ద్రవ్యాలను తరలిస్తారు. ఈ ద్రవ్యాలతో శక్తి పీఠాల్లో షోల పూజలకు శ్రీకారం చుడతారు. ఈ మహా ప్రసాదాన్ని మహార్ఘగా వ్యవహరిస్తారు.



శక్తి పీఠాలకు తరలి వెళ్లే మహార్ఘా(ఫైల్)

పూజలు అందుకుంటున్న మా భగవతి





పూజారి నుంచి అంచమాలను స్వీకరిస్తున్న దేవదాయ శాఖ అధికారి



పూజలు చేస్తున్నయువరాజు విశ్వేశ్వర చంద్రచూర్ దేవ్

మైసూరు అంతటి వైభవంగా

జయపురం: రాజుల కాలం నుంచి దేశంలోనే అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలను నిర్వహించడంలో జైపూర్ పట్టణం మైసూరును తలపిస్తుంది. ఈ ఉత్సవాలకు ఈనెల 24వ తేదీ మూలాష్టమి రోజున మా భగవతి మందిరంలో దేవికి పూజలు చేసి దేవదాయ విభాగ అధికారి సభ్యసాచి జెనకు పూజారి దేవేంద్ర రథ్ అంచమాల అందజేసి అంకురార్పణ చేశారు. ఆరోజు నుంచి జయపురం రాజుల సాంప్రదాయంగా వస్తున్న 16 రోజుల దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మా భగవతి, మా దక్షిణ కాళీ, మా జగత్‌జననీ, మా బసంతీయమా, జయపురం రాజుల కులదైవం కనక దుర్గా ఆలయంలో దసరా వరకు పూజలు జరుగుతున్నాయి. రాజుల కాలంలో రాజమహల్ ఉత్సవ హేలతో సంబరాలు అంబరాన్ని అంటేవి. ఆనాడు అశ్వాలు, సైనికులు వెంట రాగా రాజు పరివారం, ముఖ్య అతిథులు అంబారీలపై దసరా వేడుకల్లో పాల్గొనేవారు. కుమార రాజు విశ్వేశ్వర చంద్రచూర్ దేవ్ రాజరిక బాధ్యతలు చేపట్టిన తర్వాత దసరా వేడుకలకు తమ తాతల నాటి వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం దసరా వేడుకలకు అవిభక్త కొరాపుట్‌లో 72 గ్రామ దేవతల లాఠీలను ఆహ్వానించారు. దసరా నాడు దసరా పాడియలో అంగరంగ వైభవంగా రావణ దహనం జరుపుతారు.

అద్దంలో అమ్మవారి దర్శనం

కొరాపుట్: నవరంగపూర్ జిల్లాలోని కొలువుదీరిన శక్తిపీఠం మా బండారు ఘరాణి అమ్మవారి దేవాలయంలో దసర శరన్నవరాత్రుల్లో చండీ పూజలు జరుగుతాయి. ఆ పవిత్ర రోజుల్లో అమ్మవారి తీక్షణ తగ్గించడానికి వేద పండితులు చండీ పారాయణం రాత్రులు పటిస్తారు. అమ్మవారిని నేరుగా దర్శించకుండా అద్దంలో దర్శించే అవకాశం కల్పిస్తారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అద్దంలో దర్శనం ఇక్కడ మాత్రమే ఉంది. రాజఖడ్గం గర్భగుడి ముందు ఉంచి 1,001 అఖండ దీపాలు వెలిగిస్తారు.



మా బండారు ఘరణి దేవాలయం(ఫైల్)

నిషా పూజలు ప్రత్యేకం

రాయగడ: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక మజ్జిగౌరి అమ్మవారి మందిరంలో శరన్నవరాత్రుల పూజలు విశేషంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా అష్టమి నాడు అమ్మవారికి నిషా పూజలు చేస్తారు. ఈ పూజలు అమ్మవారి మందిరంలో కాకుండా మందిరానికి సమీపంలోని మెయిన్ రోడ్డు వద్ద నున్న జెన్నబౌళి చెట్టు (మందిరం) వద్ద నిర్వహించడం ప్రత్యేకం. ఆ రోజు రాత్రి మందిరం పూజారులు (బెరుకొ వంశస్తులు) అర్ధరాత్రి జెన్నబౌళి చెట్టు వద్ద పూజలను నిర్వహిస్తారు. ఈ పూజలను చేసే సమయంలో ఎవరూ లోపలకు రాకుండా జాగ్రత్త పడతారు. ఈ పూజలను ఎవరైనా వీక్షిస్తే వారు అమ్మవారి ఆగ్రహానికి గురై కష్టాలు పాలవుతారని నమ్మకం. అందువల్ల పూజారులు ఈ పూజలను ఎవరూ సంచరించని సమయంలో అర్ధరాత్రి చేపడతారు. దీనినే నిషా పూజలుగా పిలుస్తారు. అలాగే దసరా శరన్నవరాత్రుల్లో మజ్జిగౌరి అమ్మవారికి పూలతో పాటు రోజుకో రకం ఫలాలతో అలంకరిస్తారు. ఈ నవరాత్రుల్లో అమ్మవారు సునాబేడాలో భక్తులకు దర్శనం ఇస్తారు. అదే విధంగా జేకేపూర్‌లోని పేపర్ మిల్లు యాజమాన్యం నిర్వహించే ఉత్సవాల్లో రావణ దహనం కార్యక్రమం ఆకట్టుకుంటుంది.



నిషా పూజలు జరిగే జెన్నబౌళ చెట్టు ఇదే(ఫైల్)



జేకేపూర్‌లో దసర ఉత్సవాల్లో దుర్గాదేవి(ఫైల్)



పెద్ద బ్రాహ్మణ వీధిలో ఏటా జరుపుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు(ఫైల్)

దాండియాతో ప్రారంభం

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడిలో మహాలయ అమావాస్య నుంచి దసరా ఉత్సవాలు మొదలవుతాయి. గ్రామదేవత నీలమ్మ మందిరంలో శరన్నవరాత్రులు దాండియాతో మొదలుపెడతారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే తెరిచే దండుమారెమ్మ గుడి ప్రాంగణంలో అక్టోబర్ 3 నుంచి విజయదశమి వరకు ఉత్సవాలు కొనసాగిస్తారు. వివిధ రాష్ట్రాల నుంచి దండుమారెమ్మ మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు వస్తుంటారు. అలాగే అష్టమినాడు జరిగే ఆయుధ పూజ అతి ముఖ్యమైనది. గజపతి మహారాజుల కాలం నుంచి పరంపరగా వస్తున్న ఆయుధ పూజలో భాగంగా స్థానిక బెబర్తా వీధిలో పాయక్ జాతి వారు ఆయుధాలు, డాలు, కర్రలు పట్టుకుని రాజావారి కోట బయట తమ విద్యను ప్రదర్శిస్తారు. ఖండయాత్‌లు తమ యుద్ధ నైపుణ్య ప్రదర్శన మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ ముంగిట చేసి అనేక బహుమతులు అప్పట్లో పొందేవారు. దసరా శరన్నవరాత్రులు పర్లాకిమిడిలో పెద్దబ్రాహ్మణ వీధిలో గత 50 ఏళ్లుగా ఆడంబరంగా జరుపుతుండడం విశేషం. మోహనా నియోజకవర్గం రామగిరిలో మాకురేసిని మందిరంలో విశేష పూజలు జరిపి వాహనాలకు పూజలు జరుపుతారు.



హైస్కూల్ జంక్షన్ వద్ద దుర్గాదేవి (ఫైల్)



కటిక వీధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు(ఫైల్)



సిందూరంతో ఆడతున్న మహిళలు(ఫైల్)

బెంగాలీ సాంప్రదాయంలో...

మల్కన్‌గిరి: జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దసరా రోజున బెంగాలీ సాంప్రదాయంలో స్త్రీలంతా కలిసి డీఎన్‌కే కూడలి వద్ద దుర్గా మండప్‌లో సిందూరంతో ఆటలు ఆడుతారు. ముఖ్యంగా భర్త ఆరోగ్యం కోసం మహిళలు ఇలా ఆటలు ఆడుతారని ప్రసిద్ధి. మల్కన్‌గిరి జిల్లాలో 3 లక్షలకు పైగా బెంగాలీలు ఉన్నారు. వీరంతా మల్కన్‌గిరి, కలిమెల, కోరుకొండ సమితుల్లో నివసిస్తున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య తెలిపారు. పాఠశాలకు చెందిన టీ.సంతు, ఎస్.కల్పన అండర్-19 విభాగంలో సాఫ్ట్‌బాల్ క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినుల ఎంపికపై పాఠశాల పీడీ రూప హర్షం వ్యక్తంచేశారు.

ముగిసిన డ్రోన్ టెక్నాలజీ శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో వర్సిటీ పరిశోధన, అభివృద్ధి కేంద్రం- రోసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ ఐదు రోజుల పాటు నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ శిక్షణ శనివారంతో ముగిసింది. మూడు రోజులు పాటు థియరీ, రెండు రోజుల పాటు ప్రయోగాలు నిర్వహించారు. సాంకేతిక నిపుణులు డ్రోన్ టెక్నాలజీ, పనితీరు, పైలెట్ ప్రాధాన్యత, ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న విధానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు వీసీ కేఆర్ రజిని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి మాస కల్యాణ సేవ శనివారం ఉదయం వేద మంత్రోచ్చరణల నడుమ ఘనంగా జరిగింది. భాద్రపద బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో ప్రత్యేక మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కళ్యాణ సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పలాస విద్యార్థిని



పొందర శ్రావణి పాత్రో

కాశీబుగ్గ: జమ్మూ కశ్మీరులో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4వరకు జరగనున్న 36వ జాతీ య స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగ తి చదువుతున్న పొందర శ్రావణిపాత్రో ఎంపికైంది. దీంతో జిల్లా టెన్నికాయిట్ అసోసి యేషన్ కార్యదర్శి ఎస్‌వీ జోగారావు, అధ్యక్షు డు సంతోష్‌కుమార్ మల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరధి, తమ్మినాన చిట్టిబాబు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ శాఖ ఏఈల బాధ్యతల స్వీకరణ

అరసవల్లి: విద్యుత్ శాఖ శ్రీకాకుళం డివిజన్ పరిధిలో డి-1 ఏఈగా జె.సురేష్‌కుమార్‌ను, డి-2 ఏఈగా తిరుపతిరావులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా వీరు కొత్త స్థానాల్లో బాధ్యతలను చేపట్టారు. అనంతరం వీరు మర్యాదపూర్వకంగా సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఆపరేషన్స్ ఈఈ యోగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్‌లను కలిశారు.

వీఆర్‌ఓపై దాడి

బూర్జ: అన్నంపేట గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మి మన్యం జిల్లా పాలకొండ మండలం బాసూరు గ్రామంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఆమె శనివారం విధుల నుంచి గ్రామానికి వచ్చి వేరే చోటకు వెళ్తుండగా గ్రామానికి చెందిన సోమరాజు యర్రయ్య కుమారుడు సోమరాజు పవన్ దాడి చేశాడు. ఆమెతో పాటు తల్లి మంగమ్మపై కూడా దాడికి దిగాడు. ఇటీవల జరిగిన ఓ ఘటనకు సంబంధించిన గొడవలను మనసులో పెట్టుకుని గొడవకు దిగాడని వీఆర్‌ఓ తెలిపారు. గాయపడిన ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వారి సూచనల మేరకు శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు.

పోలెండ్ కార్మికుల ఔదార్యం



మృతుడి భార్య మాణిక్యంకు నగదు అందజేస్తున్న తోటి కార్మికులు

ఇచ్ఛాపురం రూరల్: తోటి కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి తామున్నామంటూ అండగా నిలిచారు స్నేహితులు. ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి పోలెండ్‌లో వలస కార్మికుడిగా పనిచేస్తూ కిడ్నీ వ్యాధి బారినపడ్డాడు. ఆయన చికిత్సకు ఇటీవల 'పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం' వారు రూ.1,51,000లను ఆర్థిక సాయం అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. చికిత్స పొందుతూ మృతి చెందిన గురుమూర్తి కుటుంబానికి 'పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం' స్పందిస్తూ శనివారం రూ.లక్షా10వేలు అందజేశారు.

పోలీసులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

- సీఎం మోహన్‌చరణ్ మాఝి
- ముగిసిన కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశాలు

భువనేశ్వర్: ప్రజాసేవకు పోలీసుల 8 గంటల పని వేళలు పరిమితం కాదు. ఠాణాకు విచ్చేసిన ప్రతీ వ్యక్తికి రాత్రింబవళ్లు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పిలుపునిచ్చారు. రాష్ట్ర పోలీసు సూపరింటెండెంట్లని ఉద్దేశించి స్థానిక లోక్‌సేవ భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రసంగించారు. రెండు రోజుల రాష్ట్రస్థాయి కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్ల సమావేశం శనివారంతో ముగిసింది. అర్ధ రాత్రి పూటనైన ఠాణాకు విచ్చేసిన బాధితుడి గోడు క్షుణ్ణంగా ఆలకించి సత్వర భద్రత కల్పించాలని ప్రబోధించారు. ప్రధానంగా యువతులు, మహిళలు, బాలలపై మరింత అప్రమత్తంగా మెసలుకుని అభయం ఇవ్వడం అనివార్యంగా పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం చూరగొనేందుకు ఇదే బలమైన సోపానంగా ప్రోత్సహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాల రేటుపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నేరస్తులపై చర్యల పరిస్థితి అత్యంత శోచనీయంగా ఉంది. 2022 నాటి గణాంకాల ప్రకారం నేరాలపై శిక్ష అమలు రేటు నామమాత్రంగా 9.7 శాతానికి పరిమితం కావడంపై ముఖ్యమంత్రి పెదవి విరిచారు.

డీజీపీకి ఆదేశాలు

రాష్ట్రంలో విచారణలో కొనసాగుతున్న నేరాల కేసుల తాజా స్థితిగతుల్ని దాఖలు చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. వారం రోజుల్లో కేసుల విచారణ, శిక్ష విధింపు, అమలు వగైరా అంశాలతో సమగ్ర సమాచారం దాఖలు కావాలన్నారు. మహిళలపై జిల్లాలవారీగా ఉన్న కేసుల వివరాలు, నేరారోపణలు, విచారణ కోసం పెండింగులో ఉన్న పూర్తి వివరాలు దాఖలు చేయాలని తెలిపారు. ఈ విశ్లేషణ ఆధారంగా ప్రభుత్వం న్యాయ ప్రముఖులతో సంప్రదించి నేరస్తుల వ్యతిరేకంగా చట్టపరమైన చర్యల కోసం సన్నాహాలు చేస్తుందన్నారు. నేరాలు, శిక్ష సంబంధిత అంశాల్లో అందరిని సమానంగా పరిగణించి చట్ట పరిధిలో కఠిన శిక్షలు అమలు చేసేందుకు ప్రభుత్వం ఏమాత్రం వెనుకంజ వేసేది లేదని హామీ ఇచ్చారు. మహిళల వ్యతిరేకంగా నేరాల కేసుల విచారణలో జాప్యం నివారించి సత్వర న్యాయం సకాలంలో అందజేయాలి. ఠాణాలకు విచ్చేసే మహిళలపై ఏమాత్రం అసభ్యతి సహించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

హోం గార్డుల పునః నియామకం

త్వరలో 2,298 మంది హోం గార్డులను పునః నియమించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఫీల్డు డ్యూటీ కార్యకలాపాల కోసం ప్రస్తుతం ద్విచక్ర వాహనం మాత్రమే అందుబాటులో ఉంటుంది. త్వరలో 4 చక్రాల వాహన సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. విధి నిర్వహణలో అకాల మరణానికి గురైన వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య కోటా కింద ఉద్యోగ అవకాశం కల్పించే దిశలో ప్రభుత్వ యోచిస్తుంది. ప్రతీ జిల్లాలో ఓడ్రాఫ్ బృందం ఏర్పాటు అవుతుంది. ఒడిశా రాష్ట్ర స్ట్రైకింగు ఫోర్సు కొత్తగా 3 బెటాలియన్లు ఏర్పాటు చేస్తుంది. పూరీ శ్రీ మందిరం భద్రతా అనుబంధ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక బెటాలియన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య బోధన ఆస్పత్రుల ప్రాంగణాల్లో భద్రతా వ్యవస్థ పటిష్టం అవుతుంది. రాష్ట్రంలో 10 వైద్య కళాశాలల ప్రాంగణంలో ఒక్కొటి చొప్పున పోలీసు ఔటు పోస్టు ఏర్పాటు అవుతుంది. స్థానిక బరముండా బస్టాండు ప్రాంగణంలో కొత్తగా పోలీసు ఔటు పోస్టు ఏర్పాటు చేస్తారు. ప్రతి ఠాణాలో సబ్ ఇనస్పెక్టరు, సహాయ సబ్ ఇనస్పెక్టరు. ఇనస్పెక్టరు ఇంచార్జి కోసం ఒక్కో ద్విచక్ర వాహనం ఠాణాలో అందుబాటులోకి తెస్తారు.



సమావేశానికి హాజరైన అధికారులతో సీఎం మోహన్



సమావేశానికి హాజరైన ఎస్పీలు

ఉత్తమ పర్యాటక గ్రామంగా మణియాబొంధొ



అవార్డు అందుకుంటున్న రాష్ట్ర పర్యాటక శాఖ అధికార ప్రతినిధులు



మణియాబొంధొ చేనేత చీర

భువనేశ్వర్: రాష్ట్రంలో మణియాబొంధొ గ్రామం ఉత్తమ పర్యాటక గ్రామం అవార్డు అందుకుంది. కటక్ జిల్లా అఠొగొడొ మండలంలోని మణియాబంధొ గ్రామం చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి. ఈ గ్రామం ఉత్పత్తి చేనేత చీర మణియాబొంధొ చీరగా ప్రత్యేకత సంతరించుకుంది. ఈ చీరకు భౌగోళిక ఉనికి కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇక్కడి చీరతో ఈ గ్రామానికి విశేష గుర్తింపు సాధ్యమైందని సర్వత్రా అభినందనలు వెల్లివిరిస్తున్నాయి. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఈ గ్రామాన్ని ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణియాబొంధొ గ్రామస్తులను ఆయన అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు శిబిరాలు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియని భారీ స్థాయిలో విస్తరించేందుకు నడుం బిగించింది. దసరా సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాల పూజా ప్రాంగణాల్లో సభ్యత్వ నమోదు శిబిరాలు ఏర్పాటు చేసేందుకు లాంఛనంగా ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పూజా పందిళ్లలో ఈ శిబిరాలు ఏర్పాటు అవుతాయి. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు, విశ్వ విద్యాలయాల ఆవరణలో బీజేపీ సభ్యత్వ నమోదు స్టాల్స్ ఏర్పాటు చేయాలనేది యోచన. యువ ఓటర్లుని ఆకట్టుకోవడం ప్రధాన లక్ష్యం. బీజేపీ యువ మోర్చా సభ్యత్వ నమోదు వర్కుషాపు కార్యక్రమంలో ఈ మేరకు యోచన తెరకి ఎక్కినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

నిందితులకు ప్రత్యేక పరీక్షలు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన స్థానిక భరత్‌పూర్ ఠాణా వివాదం నిగ్గు తేల్చే దిశలో దర్యాప్తు బృందం కసరత్తు చేస్తోంది. ఈ కేసులో 5 మంది ప్రధాన నిందితులకు అసత్య నిర్ధారణ, బ్రెయిన్ మ్యాపింగు మరియు నార్కో విశ్లేషణ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో క్రైం శాఖ దర్యాప్తు బృందం అభ్యర్థన మేరకు స్థానిక సబ్ డివిజినల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు (ఎస్‌డీజేఎం) న్యాయ స్థానం నిందితులకు ఈ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించింది. భరత్‌పూర్ ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి, సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక కానిస్టేబుల్ ఈ సంఘటనలో ప్రధాన నిందితులు. వీరందరికీ గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సు లేబొరేటరిలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. వీరందరితో కలిసి క్రైం శాఖ దర్యాప్తు బృందం ఆదివారం గుజరాత్‌కు బయల్దేరుతుంది. వివాదస్పద సంఘటన ఠాణా నాలుగు గోడల మధ్య జరగడంతో ప్రత్యక్ష సాక్షుల అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో నిజం తేల్చేందుకు బ్రెయిన్ మ్యాపింగ్ వంటి ఉన్నత స్థాయి పరీక్షలు అవసరంగా భావించిన న్యాయ స్థానం అనుమతించడం గమనార్హం.

రౌర్కెలా ఉక్కు కర్మాగారంలో పేలుడు

భువనేశ్వర్: రౌర్కెలా ఉక్కు కర్మాగారంలో శనివారం పేలుడు ఘటన సంభవించింది. ఈ ఘటనలో 5 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరందరికీ స్థానిక రౌర్కెలా ఇస్పాత్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స జరిపిస్తున్నారు. ఘటన పూర్వాపరాలు తెలియాల్సి ఉంది.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



వీసీ సుప్రియా పట్నాయిక్ చేతులమీదుగా సత్కారం అందుకుంటున్న మోనీ మదస్వామి తదితరులు

పర్లాకిమిడి: వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సెంచూరియన్ వర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో సెంచూరియన్ వర్సిటీ వీసీ డాక్టర్ సుప్రియా పట్నాయక్ పాల్గొన్నారు. విజన్ 2047 లక్ష్యంగా ఈ సదస్సుకు 15 దేశాల నుంచి 160 పరిశోధన పత్రాలు వచ్చాయి.

చివరిరోజు బహుమతి ప్రదానోత్సవంలో ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ అతుల్ జినిజీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ న్యూ ఢిల్లీ ప్రొ.మోనీ మదస్వామి, మలేషియా మోనాష్ విశ్వవిద్యాలయం డిప్యూటీ హెడ్ డాక్టర్ అవ్వారి మోహన్లను సత్కరించి మోమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో బాబీ వారణాసీ, యూఎన్‌డీపీ హెడ్ అభా మిశ్రా, రెబక్కా క్రాలీ, ప్రొ.అబూసలే తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాహిత్యంపై పట్టు ఉండాలి

- ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలస్వామి, వేదికపై పాత్రో, ఖడంగ, చిన్మయి తదితరులు

రాయగడ: విద్యార్థులకు చదువుతో పాటు సాహిత్యంపై కూడా పట్టు ఉండాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. స్థానిక యుజీఎంఐటీలో భువనేశ్వర్‌కు చెందిన అంకుర్ స్వచ్ఛంద సంస్థ శనివారం నిర్వహించిన చిల్డ్రన్స్ లిటరేచర్ ఫెస్టివల్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో అత్యధికంగా విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును సగంలో ఆపివేస్తుండడం వలన డ్రాప్ అవుట్ల సంఖ్య పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సేవా సంస్థలు సాహిత్యంపై అవగాహన కల్పించేందుకు చేస్తున్న కార్యక్రమాలు వారిలో చదువుపై ఆసక్తి పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంకుర్ వ్యవస్థాపకురాలు, కార్యదర్శి చిన్మయి పండ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్య కుసుమాలను నింపేందుకు తమ సంస్థ ద్వార 2019 నుంచి ఇటువంటి తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జర్నలిస్ట్ త్రినాథ్ ఖండంగ, ఇంపా పీఆర్వో శక్తి ప్రసాద్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విషాదం..!

- బోల్తా పడిన యాత్రికుల బస్సు
- నలుగురు దుర్మరణం



బోల్తాపడిన యాత్రికుల బస్సు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కృష్ణ ప్రైవేటు యాత్రికుల బస్సు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో నలుగురు యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఒక మహిళ ఉంది. శనివారం వేకువజామున బాలాసోర్ జిల్లా జలేశ్వర్ ఠాణా సమీపం మహ్మద్ నగర్ ప్రాంతం 60వ నంబర్ జాతీయ రహదారి పరిసరాల్లో అదుపు తప్పిన బస్సు సుమారు 20 అడుగుల లోతులో బోల్తా పడింది. సుమారు 20 మందికి పైబడి గాయాలు పాలయ్యారు. తీర్థ యాత్రల కోసం ఉత్తర ప్రదేశ్ నుంచి ఈ బస్సు బయల్దేరింది. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా నుంచి శుక్రవారం రాత్రి పూరీ శ్రీజగన్నాథుని దర్శనం కోసం దూసుకుపోతుండగా దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురైంది. ఉత్తరప్రదేశ్ బలరామ్‌పూర్ మరియు సిద్ధార్థ నగర్ జిల్లాల నుంచి 57 మంది యాత్రికులతో ఈనెల 18వ తేదీన బయల్దేరింది. దారి పొడవునా పలు పుణ్య క్షేత్రాల సందర్శనతో తీర్థయాత్ర ముగించుకుని శ్రీజగన్నాథుని దర్శనం కోసం పూరీ వైపు దూసుకుపోతూ బోల్తా పడింది.

సత్వర సహాయక చర్యలు

ప్రమాదం సంభవించిన సమాచారం అందడంతో జాతీయ రహదారి పహరా వర్గాల చొరవతో స్థానిక పోలీసులు, అగ్ని మాపక దళం ఘటనా స్థలానికి తక్షణమే చేరుకుని బాధితులకు ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 23 మంది క్షతగాత్రులను అందుబాటులో ఉన్న జలేశ్వర్ జె.కె.భట్టాచార్య ఆస్పత్రిలో చేర్చి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఉన్నత చికిత్స కోసం బాలాసోర్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 17 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం.



ఆస్పత్రి నేలపై చికిత్స పొందుతున్న బాధితులు

మృతదేహాల తరలింపు ఏర్పాట్లు

మృతదేహాలను స్వస్థలం ఉత్తరప్రదేశ్ తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం కోసం జలేశ్వర్ ఠాణా పోలీసులు బస్సు కండక్టర్, ట్రావెల్ ఏజెంటుని ప్రశ్నిస్తున్నారు. చికిత్స నుంచి కోలుకున్న బాధితుల తరలింపు కోసం రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు. వీరి కోసం ప్రత్యేక బస్సులతో 2 అంబులెన్సు వాహనాల్ని ఏర్పాటు చేసినట్లు జలేశ్వర్ ఠాణా ఇనస్పెక్టరు ఇంచార్జి రంజన్ సెఠి తెలిపారు. మృతి చెందిన యాత్రికుల ఆచూకీ లభించిందని జలేశ్వర్ ఎస్‌డీపీవో దిలీప్ సాహు తెలిపారు. రాజేష్ మిశ్రా, శాంతా రామ్ యాదవ్, కమలా దేవి యాదవ్, రాజ ప్రసాద్ యాదవ్ మృతులుగా పేర్కొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ సేవలు మరువలేనివి



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: వ్యవసాయ రంగానికి ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. స్థానిక ఫుల్‌బెడ గ్రామంలోని ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కేంద్ర సభాగృహంలో ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక లెంక, సూర్జిత్ కుమార్ తురుక్, సులోచన పాఢీ, నిరంజన్ గౌఢ, డాక్టర్ ఆశిత్ కుమార్ మానసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల ఆందోళన విరమణ

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఆందోళనను నర్సులు విరమించుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి యథాతథంగా విధులకు హాజరు కానున్నారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ శనివారం ప్రకటించారు. స్థానిక లోక్‌సేవ భవన్‌లో ఆందోళనకారుల వర్గంతో ప్రభుత్వం చేపట్టిన ముఖాముఖి చర్చలు ఫలప్రదం అయినట్లు మంత్రి పేర్కొన్నారు. నర్సుల దీర్ఘకాల కోర్కెలు నెరవేర్చేందుకు ప్రభుత్వం అంతర్ విభాగ కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి శాంతియుతంగా చేపట్టిన మౌన ప్రదర్శనపై ప్రభుత్వం పెడ చెవి వైఖరి ప్రదర్శించడంతో విధుల బహిష్కరణ ఆందోళనకు నర్సుల సంఘం పిలుపునిచ్చింది. బుధవారం నుంచి నిరవధిక విధుల బహిష్కరణ ఆందోళనకు దిగింది.

ర్యాబిస్ టీకాపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వర్సిటీ వెటర్నరీ మెడికల్ విద్యార్థులు

పర్లాకిమిడి: ప్రపంచ ర్యాబిస్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ, జంతు విజ్ఞాన స్కూల్ మెడికల్ విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాబిస్ టీకా వేయించుకుందాం.. ర్యాబిస్ నుంచి దూరంగా ఉందాం అంటూ నినాదాలు చేశారు. వెటర్నరీ స్కూల్ డీన్ డాక్టర్ రాజ్‌కిషోర్ స్వయిని మాట్లాడుతూ రేబిస్ టీకా ప్రాముఖ్యతను వివరించారు. పెంపుడు కుక్కలకు టీకా వేయించాలన్నారు. ర్యాలీలో వెటర్నరీ, అగ్రికల్చర్ డీన్ (అడ్మిన్) డాక్టర్ ఎస్‌పీ. నందా, ప్రత్యేక మెడిసిన్ డాక్టర్ జయతంగరాజ్, సర్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

తేనేటీగల దాడిలో ఒకరికి గాయాలు

రాయగడ: తేనేటీగల దాడిలో ఒకరు గాయపడిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పాటాబంధ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఈ దాడిలో గాయాలు పాలైన వ్యక్తి పాటాబంధొ గ్రామానికి చెందిన చికును కద్రకగా గుర్తించారు. ఉదయం పొలం పనులు పూర్తి చేసుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సమీపంలోని అడవుల నుంచి తేనేటీగల గుంపు వచ్చి ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్రగాయాలకు గురైన కద్రక స్పృహ కోల్పోయి పడిపోయాడు. సాయంత్రం కుటుంబీకులు అతనిని వెతుక్కుంటూ పొలానికి వెళ్లగా పడిపోయిన కద్రకను గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారు.

విజిలెన్స్ వలలో ఇంజినీర్ భానుమతి టుడు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్ర సమితి కార్యాలయంలో సహాయక ఇంజినీర్ భానుమతి టుడు విజిలెన్స్ వలలో చిక్కారు. గృహ నిర్మాణ పనుల్లో ఫైనల్ బిల్లు పాస్ చేసేందుకు ఆమె రూ.5 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డారు. విజిలెన్స్ వర్గాల వివరణ ప్రకారం కుంద్ర సమితి ఘుమర పంచాయతీకి చెందిన ఒక లబ్ధిదారుడి గృహ నిర్మాణ ఫైనల్ బిల్లు పాస్ చేసేందుకు రూ.5 వేల లంచం తీసుకుంటుంగా పట్టుకున్నట్లు విజిలెన్స్ ఎస్పీ ప్రద్యుమ్న కుమార్ ద్వివేదీ తెలిపారు. గతంలో ఆమె నందపూర్‌లో పని చేశారు.



పట్టుబడిన భానుమతి టుడు

క్లుప్తంగా

బాలికల కబడ్డీ పోటీల ప్రారంభం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టు

విజయనగరం: అండర్ 19 స్కూల్స్‌గేమ్స్ కబడ్డీ బాలికల ఎంపిక పోటీలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ ఉప సంచాలకుడు ఎం.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ మేరకు శనివారం నగరంలోని బాలికల హైస్కూల్ మైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల అనంతరం జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అర్‌ఐఓ మాట్లాడుతూ కబడ్డీ అంటే విజయనగరం జిల్లాకు మంచి పేరు ఉందని దాన్ని గుర్తించే విధంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో బాగా ఆడి..జిల్లా పేరును నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, తౌడుబాబు, బంటుపల్లి శివ, సౌదామని, తదితరులు పర్యవేక్షించారు.

ర్యాబిస్ టీకాపై అవగాహన



పర్లాకిమిడిలో సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ మెడికల్ విద్యార్థులు

పర్లాకిమిడి: ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ, జంతువిజ్ఞాన స్కూల్ మెడికల్ విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాబిస్ టీకా వేయించుకుందాం.. ర్యాబిస్ నుంచి దూరంగా ఉందాం అంటూ నినాదాలు చేశారు. వెటర్నరీ స్కూల్ డీన్ డాక్టర్ రాజ్‌కిషోర్ స్వయిని మాట్లాడుతూ రేబిస్ ప్రాముఖ్యతను వివరించారు. పెంపుడు కుక్కలకు టీకా వేయించాలన్నారు. ర్యాలీలో వెటర్నరీ, అగ్రికల్చర్ డీన్ (అడ్మిన్) డాక్టర్ ఎస్‌పీ. నందా, ప్రత్యేక మెడిసిన్ డాక్టర్ జయతంగరాజ్, సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ ఎంపిక పోటీలు రేపు

విజయనగరం: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 30 తేదీన జెడ్పీ హైస్కూల్ బాడంగిలో నిర్వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అండర్ 14,17 విభాగాల్లో బాల,బాలికల ఎంపిక పోటీలు నిర్వహించ నున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు వారి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440089001 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్టోబర్ 1 ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

అలాగే అక్టోబర్ 1 తేదీన గంట్యాడ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు అర్హత కలిగిన విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సైనికపాఠశాలలో స్వర్ణోత్సవం



స్వర్ణోత్సవంలో 1974వ బ్యాచ్ విద్యార్థులు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ పంచాయతీ పరిధిలో ఉన్న కోరుకొండ సైనిక పాఠశాలలో 1967–1974 బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన 23మంది విద్యార్థులు తమతమ కుటుంబాలతో పాఠశాలకు విచ్చేసి తాము విద్యార్థి దశలో పంచుకున్న అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ బ్యాచ్‌కు సంబంధించి 1996లో మిగ్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వింగ్ కమాండర్ ఎస్‌కేరావు (వాయుసేన మెడల్)చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ప్రత్యేక నివాళులు అర్పించారు. ఒక్కొక్కరు తమ వృత్తిపరమైన ప్రయాణాలు, వారి విజయంలో పాఠశాల పోషించిన కీలకపాత్ర అనుభవాలను పంచుకున్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను సత్కరించారు.

కామాంధుడికి దేహశుద్ధి


బొబ్బిలి: పట్టణంలో కీచక పర్వాలకు తెరలేచిందా? అమ్మాయిలు, మహిళల పట్ల నయవంచకులు బరితెగిస్తున్నారా అంటే.. ఇటీవల వెలుగు చూస్తున్న ఘటనలను చూస్తే అవుననే అనిపిస్తోంది. ఓ ఉన్నత పాఠశాలలో కీచక ఉపాధ్యాయుడి కీచక పర్వం మరచిపోక ముందే.. పోస్టల్ శాఖకు చెందిన ఉన్నతోద్యోగి లైంగిక వేధింపుల పర్వం వెలుగుచూసింది. పొరుగు పట్టణం నుంచి ఇటీవలే ఇక్కడి పోస్టల్ శాఖలోని పర్యవేక్షక విభాగంలో ఉన్నతోద్యోగంలో నియామకమైన ఓ అధికారి.. కామాంధుడిగా మారారు. బొబ్బిలి పరిసరాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అమ్మాయిలను శాఖాపరమైన పనుల పేరుతో నాయుడు కాలనీలో ఉన్న సొంత కార్యాలయానికి పిలిచి లైంగికంగా వేధిస్తున్నారు. ఓ ఉద్యోగిని విషయాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు చెప్పడంతో శనివారం దేహశుద్ధి చేశారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

గుండె నిబ్బరం అవసరం

- హృదయాన్ని పరిరక్షించుకోవాలి
- పెరుగుతున్న హార్ట్ సమస్యలు
- ఏటా 10 వేల మందికి పైగా గుండెజబ్బులు
- బీపీ, సుగర్ నియంత్రణలో ఉంచుకోవాలి
- నేడు ప్రపంచ గుండె దినోత్సవం



ఉరుకుల పరుగుల జీవనంతో మనుషుల ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు వచ్చాయి. అలాగే శారీరక శ్రమ దూరమవుతోంది. ఉద్యోగులు పనిఒత్తిడికి, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారు జీవనం ఏ విధంగా సాగించాలనే ఆందోళన, విద్యార్థులకు భవిష్యత్తుపై బెంగ ఇలా ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ఆందోళన ఉంటోంది. దీని వల్ల అత్యంత ప్రధానమైన గుండెకు హాని జరిగే ప్రమాదం ఉంది. ఆదివారం ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: గుండెను పరిరక్షించుకోకపోతే మానవుని ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ప్రతి వ్యక్తి గుండెను పరిరక్షించుకోవడం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సరైన ఆహార నియామలు పాటించకపోవడం, కొవ్వు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తినడం తదితర కారణాల వల్ల ఎక్కువ మంది గుండెజబ్బుల బారిన పడుతున్నారు.

సాధారణ రక్తపోటు

సాధారణ రక్తపోటు అంటే సిస్టోలిక్ ప్రెజర్ 120 కంటే తక్కువగా, డయోస్టోలిక్ ప్రెజర్ 80ఎంఎంహెచ్‌జీ కంటే తక్కువగా ఉండాలి. అయితే రక్తపోటు సందర్భానుసారం మారుతుంది. నిద్ర, బరువు, వయస్సు, వ్యాయమం, ధూమపానం, మద్యపానం తదితర కారణాలతో రక్తపోటు పెరగవచ్చు, తగ్గవచ్చు.

వ్యాధిని గుర్తించడం

వ్యాధిలో సాధారణంగా ఎటువంటి లక్షణాలు కనిపించవు. బీపీని వైద్య పరీక్ష ద్వారానే గుర్తించడం సాధ్యం.రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు మాత్రమే కొన్ని లక్షణాలు బయటపడతాయి. తల నొప్పి, శ్వాసతీసుకోవడంలో కష్టం, ఛాతీలో నొప్పి లక్షణాలు కనిపిస్తాయి.

అధిక రక్తపోటుకు కారణం

నూడిల్స్, చాట్స్, పానీ పూరీ వంటి జంక్ ఫుడ్స్ తినడం, టీవీ అధికంగా చూడడం, శారీరక వ్యాయమం లేకపోవడం, ఒకే చోట 8 నుంచి 12 గంటల పాటు పనిచేయడం, మానసిక ఒత్తిడి, సంఘర్షణ, ఆత్మన్యూనత, పొగతాగడం, ఆల్కహాల్ తీసుకోవడం వంటి వాటి వల్ల అధిక రక్తపోటు వస్తుంది.

హైపర్ టెన్షన్ రాకుండా జాగ్రత్తలు

ప్రతిరోజూ అరగంట పాటు వ్యాయమం చేయాలి. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా గడపాలి. పొగతాగడం, మద్యం తీసుకోవడం పూర్తిగా మానివేయాలి. యోగా, దైవభక్తి పెంపొదించుకోవాలి. ఉప్పు, మసాలాలు, తగ్గించుకోవాలి. అధికపిండి పదార్థాలు, జంక్‌ఫుడ్ తగ్గించుకోవాలి. 30 సంవత్సరాలు పైబడిన వారు ప్రతి 6 నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

అధిక రక్తపోటు

రక్తనాళాల్లో రక్తం సాధారణ ఒత్తిడికంటే ఎక్కువ ఒత్తిడితో ప్రసరించినప్పుడు దానిని అధిక రక్తపోటు అంటారు. బీపీ కొంత వ్యవధి సేపు 140/90 ఎంఎంహెచ్‌జీ లేదా అంతకన్నా ఎక్కువగా ఉన్నట్లయితే వైద్యులు అధిక రక్తపోటుగా గుర్తిస్తారు. తరచూ రక్తపోటు తనిఖీ చేయించుకోవాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రక్తపరీక్ష చేయించుకోవాలి. హైపర్ టెన్షన్ ఉన్నట్లయితే వైద్యుడిని సంప్రదించాలి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన గుండెజబ్బులు కేసుల వివరాలు	
సంవత్సరం	నమోదైన కేసులు
2014–15	10,142
2015–16	16,658
2016–17	28,681
2017–18	7506
2018–19	14,099
2019–20	25,800
2020–21	25,455
2021–22	27,400
2022–23	28,500
2023–24	27,600
2024–25	15,500(ఆగస్టు నెలాఖరు నాటికి)



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగికి ఈసీజీ తీస్తున్న టెక్నీషియన్



గజపతినగరం ఆస్పత్రికి గుండెనొప్పితో వచ్చిన రోగికి చికిత్స అందిస్తున్న వైద్యుడు

గుండెజబ్బులపై గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో గుండె జబ్బులు ఉన్న వారి కోసం స్టెమీ (హృదయ స్పందన) అనే కార్యక్రమాన్ని చేపట్టింది. సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహించింది. గుండె నొప్పితో ఆస్పత్రికి వచ్చే వారి కోసం సకాలంలో రూ.25 వేలు విలువ చేసే ఇంజక్షన్ చేసేవారు.దీని వల్ల గుండె నొప్పితో వచ్చిన వారికి ప్రాణాపాయం తప్పుతుంది. అక్కడ చికిత్స అనంతరం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి కార్డియాలజీ కోసం రిఫర్ చేసేవారు. అక్కడ రోగికి అన్ని పరీక్షలు చేసి స్టంట్ అవసరమైన వారికి వేయడం, బైపాస్ సర్జరీ అవసరమైన సర్జరీ చేసేవారు. కార్డియాలజీ విభాగం ఉన్న ఆస్పత్రుల వైద్యులతో ఒక గ్రూపు ఏర్పాటు చేశారు. సీహెచ్‌సీకి గుండె జబ్బులతో వచ్చిన రోగులకు సంబంధించిన ఈసీజీ రిపోర్టు గ్రూప్‌లో పెట్టగానే కార్డియాలజిస్టు ఇచ్చిన సూచన మేరకు వైద్యం అందించేవారు.

మానసిక ఒత్తిడి ఉండకూడదు

ఇటీవల కాలంలో గుండె పోటు కేసుల్లో ఎక్కువగా 40 ఏళ్ల లోపు వారు ఉంటున్నారు. ధూమపానం, కొకైన్, డ్రగ్స్, ఖైనీ వంటివి తీసుకోవడం, ఆహారపు అలవాట్లు మారడం , వ్యాయమం లేకపోవడం, విపరీతమైన మానసిక ఒత్తిడి వంటి కారణాలతో గుండెపోటు వస్తుంది. రక్తం చిక్కగా ఉండడం వల్ల సడన్‌గా గుండెపోటు వస్తుంది. గుండె పోటు లక్షణాలు ఏమాత్రం కనిపించినా వైద్యులను సంప్రదించాలి. పీచు పదార్థాలు ఉండే కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. తాజా పండ్లు తినాలి.

డాక్టర్ శరత్‌కుమార్ పాత్రో,
కార్డియాలజిస్టు, విజయనగరం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల ప్రతిభ

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల క్రీడాకారిణులు రెండు ప్రథమ స్థానాలు సాధించారు. ఈ మేరకు కబడ్డీ కోచ్, రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు శనివారం మాట్లాడుతూ ఈ నెల 20, 21తేదీల్లో అనకాపల్లి జిల్లా సాలపువానిపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు ప్రథమ స్థానం సాధించి రూ.30వేల నగదు బహుమతి పొందిందని, మళ్లీ అదే జట్టు 25, 26తేదీల్లో అనకాపల్లి జిల్లా మునగపాకలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రూ.20వేలు నగదు బహుమతి సాధించినట్లు తెలిపారు. కాగా సాలపువానిపాలెం పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా తాడ్డి లావణ్య కు ప్రోత్సాహక బహుమతి లభించిందని చెప్పారు. ఈ సందర్భంగా రెండు బహుమతులు సాధించిన కబడ్డీ జట్టును నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షుడు బోని సూర్య నారాయణ, నగర పంచాయతీ పెద్దలు అభినందించారు.



రెండు ప్రథమ బహుమతులు సాధించిన నెల్లిమర్ల జట్టు

ప్రతి ఇంటికీ సౌర విద్యుత్

- పీఎం సూర్యఘర్ యోజనపై విస్తృత ప్రచారం
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌

విజయనగరం అర్బన్: ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ వినియోగించే విధంగా వినియోగదారులను చైతన్యపరచాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ కోరారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలుపై తన చాంబర్‌లో శనివారం ఆయన సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పథకం అమలును సమీక్షించారు. ఇప్పటివరకు 207 దరఖాస్తులు రాగా, 175 ఇళ్లకు ఏర్పాటు చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ లక్ష్మణరావు తెలిపారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ, ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నా. గృహ నిర్మాణం, టిడ్కో, పంచాయతీరాజ్, మున్సిపాల్టీలు సమన్వయంతో పనిచేసి పథకాన్ని అందరికీ వర్తింప జేయాలని సూచించారు. ముఖ్యంగా గృహ నిర్మాణం, టిడ్కో అధికారులు పథక లబ్ధిదారులకు అవగాహన కల్పించి, తమ ఇళ్లకు సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని జేసీ ఆదేశించారు. పట్టణ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి వినియోగదారులను చైతన్య పరచాలని చెప్పారు. నాణ్యమైన ఫలకాలను వినియోగించేలా, నిర్వహణ లోపాలు లేకుండా సేవలను అందించేలా, లబ్ధిదారులకు సబ్సిడీ వీలైనంత వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు కాంట్రాక్టర్లకు లేఖ రాయాలని జేసీ సూచించారు. సకాలంలో నాణ్యమైన, నిర్వహణ సేవలను అందించేవిధంగా కాంట్రాక్టర్లను ఆదేశించాలని, సేవల్లో లోపాలు ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వినియోగదారులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం , తప్పనిసరిగా నాణ్యమైన సేవలను అందించాలని వెండర్స్‌ను జేసీ ఆదేశించారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ లక్ష్మణ్, జెడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో శ్రీధర్ రాజా, వివిధ శాఖల అధికారులు, వెండర్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

గంజాయితో ఇద్దరు యువకుల అరెస్టు

- 9.700 కిలోల గంజాయి స్వాధీనం

కొత్తవలస: గుట్టుచప్పుడు లేకుండా ఏపీఎస్‌ఆర్‌టీసీ బస్సులో అక్రమంగా గంజాయిని తరలిస్తూ కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు పోలీసులకు శనివారం పట్టుపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన మోహన్(32), ప్రసన్నజైన్ ఐశ్వర్య(23)లు సూట్‌కేసు పట్టుకుని అరకు నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్‌టీసీ బస్సులో ప్రయాణికుల మాదిరిగా ఎక్కారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ షణ్ముఖరావు తన సిబ్బందితో కొత్తవలస ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద మాటు వేశారు. అరకు నుంచి వచ్చిన బస్సును తనిఖీ చేయగా ఆ ఇద్దరు యువకులు అప్రమత్తమై పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారి వద్ద గల సూట్‌కేసును పరిశీలించి అందులో 9 కేజీల, 7వందల గ్రాముల గంజాయిని గుర్తించారు. తహసీల్దార్ నీలకంఠరావు సమక్షంలో గంజాయిని సీజ్ చేసి పట్టుబడిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద 2 కిలోల గంజాయి

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద ఎస్.కోట ఎస్సై భాస్కరరావు శనివారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో రెండు కిలోల గంజాయితో పాటు ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. బైక్‌పై వస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన శివకుమార్, మణికందన్‌ల దగ్గర గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వీఎస్.మూర్తి చెప్పారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల జగన్న కాలనీలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాతకొప్పెర్లకు చెందిన లంకలపల్లి దుర్గారావు (39)కు కొన్ని రోజులుగా మానసిక స్థితి సక్రమంగా లేకపోవడం, అధికంగా మద్యం తాగుతుండడంతో మనస్తాపం చెంది ఉరివేసుకున్నట్లు బంధువులు తెలియజేశారు. మృతుడికి భార్య శ్యామల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గైతుల చోడవరం సీపీ ఆక్వాపరిశ్రమలో ఎన్‌ఎంఆర్ కార్మికుడిగా దుర్గారావు విధులు నిర్వహిస్తున్నాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ టెట్ పరీక్షల కోసం ఐదు కేంద్రాలు

- అక్టోబర్ 3 నుంచి నిర్వహణ

విజయనగరం అర్బన్: వచ్చేనెల మూడో తేదీ నుంచి జిల్లాలో నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్) కోసం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వచ్చేనెల 21వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలను 22,889 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలను బొబ్బిలిలోని స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాలలో 1,800 మంది, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 4,231 మంది, సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 3,126 మంది, సీతం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని అయాన్ డిజిటల్ జోన్ లో 12,852 మంది, జొన్నాడ లోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలో 880 అభ్యర్థులు రాయనున్నారని తెలిపారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఐడీ ప్రూఫ్ ఆధార్/పాన్/ఓటర్ కార్డ్ తదితర కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు, సందేహాల నివృత్తికి ఫోన్ 9849739920, 9493313271, 9440941627 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

సిరిమాను చెట్టుకు బ్రహ్మారథం



జమ్ము నుంచి దాసన్నపేట రోడ్డు మీదుగా తరలివస్తున్న సిరిమాను

డెంకాడ/విజయనగరం టౌన్: మంగళవాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, దారి పొడవునా పసుపునీటి చల్లదనాల నడుమ సిరిమాను తరలింపు శనివారం వైభవంగా సాగింది. డెంకాడ మండలంలోని పెదతాడివాడలో ముహూర్తం ప్రకారం ఉదయం 8 గంటలకు సిరిమాను, ఇరుసుమానుల సేకరణ పనులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు ఎడ్లబండి ఎక్కించారు. దారి పొడవునా అమ్మకు ప్రజలు నీరాజనం పలికి బ్రహ్మరథం పట్టారు. దేవదాయశాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో పోలీస్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మవారి సేవకులు, పైడిమాంబ దీక్షాపరులు సిరిమాను తరలింపులో భాగస్వాములయ్యారు. హుకుంపేటలోని రామాలయం వద్దకు సిరిమాను చేరుకునేసరికి రాత్రి 10.30 గంటలు దాటింది. ఆదివారం ఉదయం నుంచే వడ్రంగులు సిరిమానును తీర్చిదిద్దే కార్యక్రమాల్లో నిమగ్నమవుతారని ఈఓ తెలిపారు.

సిరిమాను చెట్టుకు పూజలు

సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు పూసపాటి అదితి గజపతిరాజు,లోకం మాధవిలు అమ్మవారి సిరిమాను, ఇరుసు మాను చెట్లకు గొడ్డలితో వేటువేసి సేకరించే పనులు ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎంపీలు బొత్స ఝాన్సీలక్ష్మి, బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ తదితరులు సిరిమానుకు ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను సేకరణ ప్రదేశానికి వేలాదిమంది భక్తులు రావడంతో పెదతాటివాడ భక్తసంద్రంగా మారింది.

అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి

విజయనగరం పైడితల్లి అమ్మవారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. విజయనగరం పైడితల్లి అమ్మవారికి సిరిమాను చెట్లను పెదతాడివాడ గ్రామం ఇప్పటివరకు నాలుగు సార్లు అందించడం గ్రామ ప్రజల అదృష్టమన్నారు. పెద్దలు బొత్స సత్తిబాబు, మాజీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పైడితల్లి పండగను రాష్ట్ర పండగగా ప్రకటించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పండగ కోసం ఏర్పాట్లు చేస్తోందన్నారు. అమ్మవారి తొలేళ్లు, సిరిమాను సంబరానికి 5 లక్షల మంది భక్తులు వస్తారన్నది అంచనాగా పేర్కొన్నారు.

- ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సిరిమాను ఊరేగింపు సుమారు 250 ఏళ్లుగా సంప్రదాయంగా సాగుతోందని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. సేకరించిన సిరిమాను చెట్టును వనంగుడి మీదుగా చదురు గుడికి తీసుకువెళ్లి అక్కడ నుంచి హుకుంపేటకు తరలించి సిరిమానుగా మలచడం జరుగుతుందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.
- పెదతాడివాడ గ్రామంలో విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టు కోరడం మా నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. అమ్మ ఆశీస్సులు మాపై ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు.

ఉచితం వద్దు..అక్రమమే ముద్దు..!



కలవలచర్ల వద్ద లారీలతో రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న ఇసుక అక్రమ నిల్వలు

- రాత్రివేళ లారీలతో యథేచ్ఛగా ఇసుక తరలింపు
- చీకటి పడిదంటే అక్రమ రవాణాకు మార్గంసుగమం

గుర్ల: ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తామని చెబుతున్నప్పటికీ ఇసుక రవాణా చేస్తున్న వారు మాత్రం అక్రమ మార్గానికే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని బొబ్బిలిలో మాత్రమే ప్రభుత్వం ప్రారంభించిన ఇసుక డంపింగ్ యార్డ్ లో ఇసుక ఉండడంతో పాటు అక్కడికి వెళ్లిన వాహనాలు వారం రోజుల పాటు అక్కడే ఉండిపోవాల్సి వస్తుండడంతో లారీ యాజమానులకు తలకు మించిన భారం అవుతోందని భావించి అక్రమ ఇసుక రవాణాకు తెరలేపారు. గుర్ల మండలంలోని చంపావతి నది పరీవాహక గ్రామాలైన గుర్ల, గోషాడ, కలవచర్ల, కోటగండ్రేడు, పెద్దమజ్జిపేట, ఆనందపురం, నక్కలపేట, గరికవలస గ్రామాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో కొంతమంది నాటుబళ్లతో ఇసుకను చంపావతి నది నుంచి బయటకు తెచ్చి బయట ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన ఇసుక రాత్రి సమయంలో అక్రమంగా రవాణా చేస్తున్న వారు లారీలతో జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు.

సహకరిస్తున్న పోలీసులు

చంపావతి నది పరీవాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారికి స్థానిక పోలీసులు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది పోలీసులు లారీ యాజమానులతో ఒప్పందం కుదుర్చుకుని అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మరికొంత మంది లారీ యాజమానులు నియోజకవర్గం టీడీపీ నేతలతో ఫోన్‌లో చెప్పించుకుని దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఎటువంటి పలుకుబడి లేని. పోలీసులతో ఒప్పందం కుదుర్చుకుని వారి లారీలను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

ఉచిత ఇసుక రూ.20వేలకు పైగానే

ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితిలో అది కనిపించడం లేదు. ఒక లారీకి 10 టన్నులు (3యూనిట్లు) ఇసుక పడుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో లారీ ఇసుక సుమారు రూ.8వేలకు భవన నిర్మాణదారులకు అందుబాటులో ఉండేది. టీడీపీ ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన ఉచిత ఇసుక మాత్రం సుమారు రూ.20వేలకు పైగానే ఉంది. మార్కెట్ లో ఇసుక ధర ఒక్కసారిగా పెరగడంతో అక్కమ రవాణాకే వాహనదారులు మొగ్గు చూపుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జామి: మండలంలోని శాశనపల్లి గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను జామి పోలీసులు శనివారం పట్టుకున్నారు. సోమయాజుల పాలెం గ్రామానికి చెందిన ఎం.సుబ్రహ్మణ్యం గోస్తనీ నదినుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా శాశనపల్లి సర్పంచ్ వెంకట అప్పారావు పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు



దాడులు చేస్తున్నాం

రాత్రి సమయంలో అక్రమ ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతిరోజూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

పి.నారాయణ రావు, ఎస్సై, గుర్ల